తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## కల్యాణ వెంకన్నకు అభిషేక సింహాసనం కానుక

చంద్రగిరి, అక్టోబర్ 11 ప్రభాతవార్త:



శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి వారికి బెంగుళూరుకు చెందిన భక్తులు అభిషేక సింహాసనం కానుకగా అందజేశారు. బెంగుళూరు, ఎలక్ట్రానిక్ సిటీకి చెందిన మాదన్‌మోహన్ రెడ్డి, యువజ్యోతి కల్యాణ వెంకన్నపై భక్తిప్రపత్తులతో స్నపన తిరుమంజన సేవకు వినియోగించే రాగితో తయారు చేసిన (రూ.9 లక్షలు విలువైన) అభిషే సింహాసంకు బంగారు లేజర్ పూతను జోడించారు. ఈ కానుకను శనివారం ఆలయ అధికారులు స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ వల్లంశెట్టి రమేష్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ఆనుంబట్టు ధనశేఖర్, అర్చకులు నారాయణాచార్యులకు అందజేశారు. అనంతరం అధికారులు దాత కుటుంబ సభ్యులకు దర్శన ఏర్పాట్లు గావించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## అప్పలాయగుంటకు పోటెత్తిన భక్తజనం

వడమాలపేట, అక్టోబరు 11 ప్రభాతవార్త:



పెరటాసి మాసం 4వ శనివారం కావడంతో అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. పరిసర మండలాల వారే కాకుండా తమిళనాడుకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయం వద్ద రద్దీ ఏర్పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు 7 గంటల వరకు అప్పలాయగుంటలో భక్తుల రద్దీ కొనసాగింది. ఆలయం వెలుపల మహిళలు పిండి దీపాలు వెలిగించి స్వామివారిని వేడుకున్నారు. సాయంత్రం 5 గంటలకు స్వామివారికి ఊంజల్‌సేవ జరిగింది. ఊయాలలో ఉభయ నాంచారులతో కొలువుదీరిన ప్రసన్న వెంకటేశ్వరుడు గంటపాటు చిద్విలాసంగా ఊయలలూగుతూ భక్తులకు కనువిందు చేశారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీనివాసుడి గ్రామోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ అధికారి వేణుగోపాల్ పర్యవేక్షించారు.

# కుల, మతాల మధ్య చిచ్చుకు ప్రయత్నం

**- దేవళంపేటలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన ఘటనపై సంఘీభావ కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత**



చిత్తూరు, అక్టోబర్ 11 ప్రభాతవార్త:

రాష్ట్రంను సర్వతోముఖాభివృద్ధి చేస్తుంటే అభివృద్ధిని అడ్డుకుని కుల, మతాల మధ్య చిచ్చు పెట్టడానికి ప్రయత్నిస్తున్నారని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. వెదురుకుప్పం మండలం దేవళంపేట గ్రామంలో భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన ఘటనపై శనివారం రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత సంఘీభావ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి హోం మంత్రి అనిత పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ దళితులకు రాజ్యాంగ హక్కు కల్పించిన మహానేత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను రాజకీయ క్రీడకు వాడుకోవడం దారుణమన్నారు. ప్రభుత్వంపై బురదచల్లడానికి చేసే ప్రతి ప్రయత్నంను అడ్డుకుంటున్నామన్నారు. దేవళంపేటలో వ్యక్తిగత కక్షతో అంబేద్కర్ విగ్రహం కింద వున్న షాపుకు నిప్పు పెట్టారని, రాష్ట్ర వ్యాప్తంగా దళితులను తప్పుదోవ పట్టించి రాజకీయ లబ్ది పొందే ప్రయత్నం చేశారన్నారు. దేవళంపేటలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన కేసు విచారణలో పోలీసుల స్పందన అభినందనీయమన్నారు. దళితులు ఐక్యమత్యంగా వుండాలని ఆమె పిలుపు నిచ్చారు. ఎక్కడా తప్పులు జరుగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే చిత్తూరులో గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన నిందితులను నడిరోడ్డుపై లాక్కెళ్ళి కోర్టు ముందు నిలబెట్టిన ఘనత తమదేనన్నారు. ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అందరివాడని, ప్రపంచ మేధావిగా ప్రఖ్యాతిగాంచిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి రాజకీయ చేయడం హేయమైన చర్య అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దళితులను తప్పుదారి పట్టించి రాజకీయ లబ్ది పొందడానికి ఈ ఘటనతో ప్రయత్నించారన్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ రాజకీయ ముసుగులో కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టాలని ప్రయత్నిస్తే వారిని కూటమి ప్రభుత్వం ఉపేక్షించదని హెచ్చరించారు. సిఎం చంద్రబాబు పాలనా దక్షతలో విద్రోహ చర్యలకు పాల్పడే వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందన్నారు. దేవళంపేటలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన ఘటనపై సంఘీభావం తెలపడానికి వచ్చిన హోంమంత్రి వంగలపూడి అనితకు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, సూళ్ళూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే గాంధీ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ యుగంథర్‌పొన్నా, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సిఆర్ రాజన్, జిల్లా తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్‌లు స్వాగతం పలికారు.

# ఎవరిదీ పాపం

**పుట్టీపట్టకనే పసిపాప మృతి**
**-వైద్యుల నిర్లక్షమే అంటున్న తల్లిదండులు**



చౌడేపల్లి, అక్టోబర్ 11 ప్రభాతవార్త

నవమాసాలు మోసింది బిడ్డపై ఎన్నో ఆశలు పెట్టుకొంది... ఆసుపత్రికి వెళ్ళి రాత్రంతా నొప్పులు భరించిందా తల్లి... ఉదయాన్నే లోకం చూస్తుందనుకొన్న చిన్నారి ఏమైందో కానీ పురిటిబిడ్డ పుట్టగానే మరణించింది...వైద్యుల నిర్లక్ష్యమే అంటూ తల్లిదండ్రులు బంధువులు ఆరోపిస్తూ భోరున విలపించారు. వారి కథనం మేరకు...చౌడేపల్లి కుమ్మరవీధికి చెందిన ప్రసాద్, కవితలకు ఓ కుమార్తె వుంది. దాదాపు 11యేళ్ళ తర్వాత కవిత గర్భం దాల్చింది. నెలలు నిండటంతో స్థానిక ఆరోగ్య కేంద్రానికి వెళ్ళారు. ఇక్కడ ఆమె పరిస్థితి విషమించడంతో మదనపల్లి ఏరియా ఆసుపత్రికి సిఫారస్సు చేసారు. శుక్రవారం అర్ధరాత్రి మదనపల్లి ఆసుపత్రికి చేరుకొన్నారు. 11 యేళ్ళతర్వాత గర్భందాల్చడంతో అధిక ప్రమాదముందని తెలిపిన వైద్యులు అక్కడ వుండకుండా వెళ్ళి పోయారని ప్రసాద్ తెలిపాడు. రాత్రంతా తన భార్య కవిత నొప్పులు పడుతున్నా ఎవరూ రాలేదన్నారు. అయితే ఉదయం 10గంటలకు వైద్యుడొచ్చి బిడ్డ పుట్టగానే మరణించిందని ఆడశిశువును తన చేతికందించాడని వాపోయాడు. దశాబ్దం తర్వాత జన్మించే బిడ్డకోసం సకల దేవతలను పూజించామనీ అయితే విగత జీవిగా పుట్టిన బిడ్డ చేతికొచ్చిందని తల్లిదండ్రులు, బంధువులు భోరున విలపించారు. వైద్యులు సాధారణ చికిత్స చేశారనీ, శస్త్రచికిత్సద్వారా చేసివుంటే బిడ్డ బ్రతికి వుండేదని వారంటున్నారు. ఏదిఏమైనప్పటికీ తొలి సంతానం ఆడబిడ్డకాగా పుట్టే బిడ్డ మగబిడ్డని ఆశతో వున్న తల్లిదండ్రులకు ఎవరు తప్పు చేశారో కానీ వారికి దుఃఖాన్ని మిగిల్చింది. మరణించిన పాపను సొంత గ్రామం చౌడేపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు.

## నెలలునిండని శిశువు మృతదేహం మురికికాలువలో



తిరుపతి, అక్టోబర్ 11ప్రభాతవార్త:

అభంశుభం తెలియని...కళ్ళుకూడా తెరవని ఈ లోకం చూడని నెలలునిండని పసిగుడ్డు ప్రాణాలు కోల్పోయి మురికికాలువలోకి చేరింది. ఈ పాపం ఎవరిదైనా తొమ్మిదినెలల కడుపుభారం మోసి ఈ లోకం చూపాల్సిన ఆ తల్లి నిర్దాక్షిణ్యంగా, నిరాదరణతో ఇలా కాలువకి చేర్చడం మాతృమూర్తుల హృదయం కలచివేసింది. ఈ సంఘటన శనివారం సాయంత్రం నగరంలోని సింగాలగుంట మసీదువీదిలోని మురికినీటికాల్వలో ఉండటం అందరినీ కలచివేసింది. ఈ పసిగుడ్డు మృతదేహం ప్రసూతి ఆస్పత్రి పరిసరాల్లోంచి కొట్టుకు వచ్చిందా..స్థానికంగా ఎవరైనా ఇలా చేశారనేది తేలాల్సి ఉంది. సమాచారం అందుకున్న అలిపిరి ఎస్ఐ అజిత అక్కడకు చేరుకుని పసిగుడ్డు మృతదేహాన్ని పంచనామాకు తరలించారు. అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు.

### పాల ఉత్పత్తిలో

## ప్రపంచంలోనే అగ్రస్థానం

**ప్రధాని నరేంద్రమోడీ**
**219కోట్లతో కుప్పంలో శ్రీజ డెయిరీకి వర్చువల్ శంకుస్థాపన !!**
**ధనధాన్య యోజన.. దల్హాన్ ఆత్మనిర్భర్ భారత్ ప్రారంభం !!**





కుప్పం, అక్టోబర్ 11ప్రభాతవార్త

పాల ఉత్పత్తిలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉందని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. శనివారం సిఎం చంద్రబాబునాయుడు చొరవతో కుప్పంలో 219 కోట్లతో ఏర్పాటుకానున్న శ్రీజ డెయిరీతో పాటు దేశంలోని పలు రాష్ట్రాల్లో కొత్త డెయిరీ ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలను వర్చువల్ విధానంలో నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాని మోడీ ప్రసంగిస్తూ భారతదేశంలో కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టామన్నారు. మహనీయులు జయప్రకాష్ నారాయణ రైతుల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన జయంతి నాడు ఎన్డీయే ప్రభుత్వం ప్రధానమంత్రి ధనధాన్య కృషి యోజన, దల్హాన్ ఆత్మనిర్భర్ భారత్ పథకాలను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ధనధాన్య యోజన పథకాన్ని దేశంలోని 100 జిల్లాల్లో తొలుత అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకై 23వేల కోట్లు వ్యయం చేస్తామన్నారు. దల్హాన్ పథకానికి 11వేల కోట్లు వ్యయం చేయనున్నట్లు పేర్కొన్నారు. 11 ఏళ్ల తమ పాలనలో విద్యుత్ వసతి లేని గ్రామాలకు కరెంట్ ఇవ్వడంతో పాటు రైతుల అభ్యున్నతికి పలు పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు రైతులకు 2లక్షల కోట్ల మేర రైతులకు పంటల భీమా చెల్లించామన్నారు. పంటలసాగు చేపట్టే రైతులకు ఖర్చు తగ్గించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మహిళలు కూడా వ్యవసాయ రంగంలో మరింత ము ందుకు రావడం పట్ల అభినందించారు. పప్పు, దినుసుల ఉత్పత్తులు పెరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేశంలో మాతా శిశు మరణాలు తగ్గించామన్నారు. 125కోట్ల మందికి టీకాలు వేశామన్నారు. కాంగ్రెస్ పాలనలో కంటే ఎన్డీయే పాలనలోనే వ్యవసాయ రంగం సమగ్ర అభివృద్ధి సాధిస్తోందన్నారు. దేశ ప్రజలకు పండగల సమయంలో జిఎస్టీ శ్లాబ్ శాతాన్ని తగ్గించామని దీంతో ప్రజలకు ఎంతో లబ్ది కలుగుతోందన్నారు. ఈ కార్య క్రమంలో కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, రెస్కో ఛైర్మన్ విజి ప్రతాప్ కుమార్, కాణిపాకం బోర్డు సభ్యుడు నరేష్, ఏరియా ఆస్పత్రి వైస్ ఛైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్, స్థానిక నేతలు, శ్రీజ డెయిరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# వర్షాలకు కొట్టుకుపోయిన కాజ్‌వేలు

**-పలు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం**





తడకర వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న బహుదానది, గాజులపల్లె వద్ద బహుదానదిపై తెగిపోయిన కాజ్‌వే

తవణంపల్లె, అక్టోబర్ 11 ప్రభాతవార్త:

మండలంలో గత రెండు రోజులగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించడంతో పలు ప్రాంతాల్లో నదులు, వంకలుపై నిర్మించిన కాజ్‌వేలు కొట్టుకుపోయాయి. దీనితో మండలంలోని పలు గ్రామాలకు వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గత 15 రోజుల క్రితం కురిసిన వర్షాలకు మండలంలోని నదులు, వాగులు వంకలు ఒక మోస్తరుగా ప్రవహిస్తున్నాయి. అయితే గురు, శుక్రవారాల్లో మండలంలో భారీ వర్షాలు కుర వడంతో ఈవాగులు, వంకలు, నదులు ఉధృతంగా పొంగి ప్రవ హించాయి. మండలంలోని పడమటి అటవీ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో వరదనీరు భారీగా మండలానికి వచ్చి చేరుతోంది. దీనితో మండలంలోని అరగొండ సమీ పంలో బహుదానది, గొడ్డువంక, మత్యం వంకలు ఉధృతంగా ప్రవహించాయి. దీనితో వీటిపై నిర్మించిన కాజ్‌వేలు కొట్టు కుపోయాయి. బహుదానదిపై నిర్మించిన కాజ్‌వేలు వరద ఉధృతికి పలు ప్రాంతాల్లో కొట్టుకుపోయాయి. ఈమేరకు అరగొండ-సరకల్లు రహదారిలో తొడతర, గాజులపల్లె వద్ద, అరగొండ-జొన్నగురుకల రహదారిలోని అరగొండ వద్ద నిర్మిం చిన కాజ్‌వేలు కొట్టుకుపోయాయి. అలాగే కాణిపాకం సమీపం లోని పుణ్యసముద్రం వద్ద వున్న కాజ్‌వే వరద ఉధృతికి కొట్టుకుపోయింది. దీనితో పాటు బంగారుపాళ్యం రహదారిలో మత్యం వంకపై దిగువమత్యం సమీపంలో వున్న కాజ్‌వే కూడా తెగిపోయింది. దీనితో మండలంలోని సుమారు 30 గ్రామాలకు శనివారం ఉదయం నుండి బస్సులు, భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా వుండగా మండల తహశీల్దార్ సుధాకర్, పోలీసులు శనివారం ఉదయం తమ సిబ్బందితో కలసి నదుల్లో వరద ఉధృతిని పరిశీలించి ఆమార్గాల్లో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిపివేశారు. దీనితో అత్యవసర పరిస్థితుల్లో వివిధ ప్రాంతాలకు వెళ్ళాల్సిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరద ఉధృతి తగ్గే వరకు కాజ్‌వేలు మరమ్మత్తులు అయ్యే

## చెల్దిగానిపల్లిలో చోరీ..

**400 గ్రాముల బంగారం కాజేత**

రామకుప్పం, అక్టోబర్ 11ప్రభాతవార్త

మండలంలోని చెల్దిగానిపల్లిలో శనివారం ఓ ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చొరబడి సుమారు నాలుగువందల గ్రాముల బంగారాన్ని పట్టుకెళ్లారు. బాధితులు, పోలీసులుతెలిపిన మేరకు వివరాలిలా..గ్రామంలో పెద్దన్న కుమారకుడు గోవర్ధన్ వ్యవసాయం చేసుకుని కుటుంబంతో గడుపుతున్నాడు. శనివారం తన కుటుంబీకులతో కలసి పంట పొలాలకు వెళ్లారు. అయితే వ్యవసాయ పనులుముగించుకుని ఇంటికి తిరిగి వచ్చి చూడగా ఇ ంటి తాళాలు పగలగొట్టి ఉన్న విషయం గుర్తించారు. ఇంట్లోని బీరువా, సామగ్రిని గుర్తు తెలియని దుండగులు చిందరవందరగా పడేసి ఇంట్లోని సుమారు నాలుగు వందల గ్రాముల బంగారం దొంగిలించారని పేర్కొన్నారు. సిసి కెమెరాల ఆధారంగా ఇంటి ఆవరణలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తి గురించి రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలిని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటమోహన్ తెలిపారు.

### రూ.11లక్షల విలువ చేసే

## ఎర్రచందనం స్వాధీనం



శ్రీకాళహస్తి, అక్టోబర్ 11 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి అక్రమంగా రవాణా జరుగుతున్న ఎర్రచందనంపై నిఘా కట్టుదిట్టం చేసినట్లు అటవీశాఖాధికారి లోకేష్ శనివారం తెలిపారు. ఏర్పేడు మండలంలోని సదాశివకోన నుంచి అక్రమంగా రవాణా జరగటానికి సిద్దంగా ఉన్న రూ.11లక్షల విలువ చేసే 51కిలోల దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సదాశివకోనలో కొందరు గుర్తుతెలియని స్మగ్లర్లు ఉన్నట్లు గుర్తించినట్లు వివరించారు. ముందస్తు సమాచారం అందటంతో తిరుపతి అటవీశాఖ అధికారులు టాస్క్‌ఫోర్సు సిబ్బంది సదాశివ కోనకు వెళ్ళగా తమను చూసిన స్మగ్లర్లు పారిపోయారన్నారు. ఈ ప్రాంతంలో అక్రమరవాణాకు సిద్దంగా ఉంచిన 435కిలోల 51 దుంగలు, విలువ రూ.11లక్షలది స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ ప్రాంతంలో మరి కొన్ని చెట్టు నరికి పడేసినట్లు గుర్తించామన్నారు. వాటిని కూడా తరలించుటకు ప్రణాళిక రూపొందించినట్లు లోకేష్ వివరించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిసర ప్రాంతాల్లో ఉన్న అడువుల్లో ఎర్రరందనం సంపద అధికంగాఉందని వాటిని సంరక్షించే దిశగా అధికారులతో కలసి అక్కడ బేస్ క్యాంప్ ఏర్పాటు చేసే విధంగా కార్యచరణ చేపడతామన్నారు. తమిళనాడు నుంచి వస్తున్న స్మగ్లర్లకు స్థానికులు సమాచారం అందిస్తున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. వారి వివరాలు ఊడా సేకరిస్తున్నామని తెలిపారు.

## జలమయమైన పంట పొలాలు





మాధవరంలో వరి పంటలో చేరిన వర్షపునీరు, క్షూరికాపురం ఆది ఆంధ్రవాడ వద్ద చెరువును తలపిస్తున్న తారురోడ్డు

విజయపురం, అక్టోబరు 11 ప్రభాతవార్త:

మండలంలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం వరకు వర్షం కురవడంతో పంట పొలాలు జలమయమయ్యాయి. సుమారు 4 గంటలు ఉరుములు మెరుపులతో భారీగా వర్షం కురవడంతో పంట పొలాలు జలమయమయ్యాయి. మండలంలో సుమారు 30 చెరువుల్లో కూడా జలకళ సంతరించుకుంది. రోడ్డుపైన వరద నీటి ప్రవాహం పెరగడంతో రాకపోకలకు కొంత ఇబ్బంది నెలకొందని రైతులు వాపోయారు. మండలంలోని క్షూరికాపురం ఆది ఆంధ్రవాడ వద్ద వర్షపునీరు రోడ్డుపై పారుతుందని, రోడ్డు పక్కల కాలువలు పూడిపోవడం వలన ఇలా జరుగుతున్నదని, కాలువలను మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

# టిటిడిలో సింఘాల్ మార్కు పాలనకు శ్రీకారం



ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

అనుభవజ్ఞులైన, సీనియర్ ఐఏఎస్ అధికారి టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్ ధార్మికసంస్థలో తనదైన మార్కు పాలనకు శ్రీకారం చుట్టారు. ఆయన గతంలో ఈఓగా పనిచేసిన పాలన పరమైన అనుభవం ఉండటంతో ఈ మార్పులు తప్పనిసరి అయ్యాయి. ఒక్కసారిగా టిటిడిలో పలుచోట్ల పనిచేస్తున్న డిప్యూటీ ఈఓ అధికారుల బదిలీలు చేయడం త్వరలో మరికొందరి కుర్చీలు కదలనున్నాయనేందుకు తార్కాణం. బ్రహ్మోత్సవాలకు ముందే ఈఓగా రెండవసారి బాధ్యతలు చేపట్టిన సింఘాల్ పాలనను గాడిన పెట్టడానికి భారీ వ్యూహాన్ని రూపొందించారనేది "వార్త"ప్రధానంగా వెల్లడించింది. బ్రహ్మోత్సవాలు ముగియగానే డిప్యూటీ ఈఓలను పూర్తిగా బదిలీ చేసి టిటిడిలో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. తిరుమల ఆలయ డిప్యూటీ ఈఓగా ఉన్న ఎం.లోకనాథంను తిరుపతి గోవిందరాజస్వామి ఆలయానికి, తిరుచానూరు పద్మావతిఅమ్మవారి ఆలయ డిప్యూటీ ఈఓ పి,హరీంద్రనాథ్‌ను ఏకంగా మళ్ళీ రెండవసారి తిరుమల ఆలయానికి నియమించారు. తిరుమలలో వసతి కల్పన విభాగం డిప్యూటీ ఈఓ (ఆర్1)భాస్కర్‌ను టిటిడి పరిపాలన భవనంలోని సర్వీసెస్ విభాగానికి, ఇక్కడ ఉన్న గోవిందరాజన్‌ను తిరుమల కల్యాణకట్టకు, అన్నదానం డిప్యూటీ ఈఓగా సెల్వంను,, వసతికల్పనవభాగం డిప్యూటీ ఈఓ(ఆర్1)గా అన్నదానం డిప్యూటీ ఈఓ రాజేంద్ర నియమితులయ్యారు. ఆర్2గా ఇన్‌ఛార్జిగా కూడా వ్యవహరిస్తారు. తిరుచానూరు పద్మావతిఅమ్మవారి ఆలయ డిప్యూటీ ఈఓగా గోవిందరాజస్వామి ఆలయం నుండి శాంతి , వెంకటయ్యను తిరుపతి అన్నదానం డిప్యూటీ ఈఓగా బదిలీ చేశారు. ఇక రెండుమూడురోజుల్లో పూర్తిస్థాయిలో ఆలయం నుండి వసతికల్పన విభాగం, దాతల విభాగం, మార్కెటింగ్ విభాగంతోబాటు స్థానిక ఆలయాల్లో ఉన్న ,కీలకమైన కొన్ని విభాగాల సూపరింటెండెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లను బదిలీ చేసేందుకు రంగం సిద్దంచేశారు. వీరిలో కొందరు గత వైసిపికి వంతపాడుతున్నట్లు టిటిడికి అందిన ఫిర్యాదులు. ఈ నేపథ్యంలో సూపరింటెండెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లతోబాటు సబార్డినేట్‌లను బదిలీ చేసి పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసేందుకు సింఘాల్ సిద్దమయ్యారు. చాలావరకు విభాగాలన్నీ మార్పుచేసి పారదర్శక పాలన సాగించాలనేది సింఘాల్ ఆలోచన. అదేసమయంలో టిటిడి బోర్డు ఛైర్మన్ బిఆర్‌నాయుడు కూడా సేవానిరతి, దేవుని చెంత భక్తిభావంతో వుండే వారికి తగిన ప్రాధాన్యతనివ్వాలని భావిస్తున్నారు. ప్రభుత్వం ఆదేశించిన విషయాలను సమర్ధవంతంగా అమలుచేయడంలో ఒక ప్రత్యేకత చాటుకున్న సీనియర్ ఐఎఎస్ అధికారి అనిల్‌కుమార్‌సింఘాల్‌గా కూడా ముద్రవుంది. 2017లో ఈఓగా నియమితులైన తొలిసారి ఆయన పనిచేసిన నాలుగుసంవత్సరాల కాలంలో ఉద్యోగుల పక్షపాతిగా...సమస్యల పరిష్కారంలో సున్నితత్త్వంతో వ్యవహరించారనేది చర్చనీయాంశం. అప్పటి టిటిడి తిరుమల జెఈఓ కెఎస్ శ్రీనివాసరాజు, తిరుపతి జెఈఓ పోలా భాస్కర్‌ల సహకారంతో సమష్టి కృషితో కొన్ని నిర్ణయాలను అమలు చేయగలిగారు. టిటిడి పాలనలో సుప్రీమ్ అయిన టిటిడి ధర్మకర్తలమండలి ఛైర్మన్, సభ్యులతో సఖ్యతగా వ్యవహరించి పలు కీలక విషయాలను ముందుకు నడిపించిన సమర్ధ అధికారిగా సింఘాల్ పేరుతెచ్చుకున్నాడు. మరీ ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన ఇంకెందరిని ప్రక్షాళన చేస్తారనేది ఉద్యోగుల్లో అంతర్మథనం మొదలైంది.

## క్రమశిక్షణతో వచ్చే విద్య ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది




**తిరుపతి విద్య అక్టోబర్ 11 ప్రభాతవార్త:** కళాశాలలో క్రమశిక్షణతో నేర్చుకునే విద్య వారిని ఉన్నత శిఖరాలకు చేరువచేసి సమాజంలో తలెత్తుకుని బ్రతికేలా శక్తి సామర్థ్యాలను ఇస్తుందని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి తెలిపారు. శనివారం తిరుపతి కరకంబాడి మార్గంలోని శ్రీరామ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే ను పరిచయ్ 2025 పేరుతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రామిరెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు బిడ్డల భవిష్యత్తు కోసం కష్టించి కళాశాల విద్యకు పంపుతారని, ఇదే సమయంలో విద్యార్థులు తల్లిదండ్రులు ఇచ్చే డబ్బులను కాకుండా వారి ఆశయాలను గుర్తించుకొని విద్యను అభ్యసించాలన్నారు. శ్రీరామ కళాశాల విద్యార్థి జీవితంలో ఉన్నత లక్ష్యం చేరుకొని తిరిగి ఇదే కళాశాలలో నిర్వహించే కార్యక్రమానికి అతిథిగా వచ్చినప్పుడు తాను చాలా సంతోషపడతానన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏఎస్పి రవిమనోహరా ఆచారి మాట్లాడుతూ తల్లిదండ్రుల కలలను సాకారం చేయడానికి, ఉన్నత లక్ష్యాలు చేరుకుని ఆర్థికంగా ఎదిగి సమాజంలో తమకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకోవాలని సూచించారు. నేడున్న టెక్నాలజీ ప్రపంచంలో సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తమై వారి తల్లిదండ్రులను జాగృతి చేయాలన్నారు. ఎంతో విలువైన భవిష్యత్తును చెడు వ్యసనాలకు, అక్రమ పద్ధతిలో డబ్బులు సంపాదించడానికి వినియోగించొద్దన్నారు. అత్యాశతో పోయి ఫ్రాడ్ ఇన్వెస్ట్మెంట్లు చేస్తూ లక్షల కోట్ల రూపాయలు పోగొట్టుకుంటున్న సందర్భంలో అప్రమత్తం చాలా అవసరం అన్నారు. అనధికారిక లింకులు, హనీ ట్రాప్ వంటి విషయాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థుల పట్ల ప్రత్యక్ష స్వీయ పరిశీలన చేస్తున్నామని, వారి భవిష్యత్తు లక్ష్యాలను చేరుకోవడానికి అవసరమైన అన్ని సదుపాయాలను కళాశాలలో ఏర్పాటు చేసామన్నారు. ఈ సందర్భంగా పలు పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట డి.ఎస్.పి యు శ్రీనివాస రావు, సీఐ జయచంద్ర, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర, వైస్ ప్రిన్సిపాల్ వాసు, కళాశాల విభాగాధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## 2026 సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

**తిరుపతి విద్య, అక్టోబర్ 11 ప్రభాతవార్త:** 2026-27 విద్యా సంవత్సరానికి జాతీయ స్థాయి ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ ద్వారా 6వ, 9వ తరగతుల ప్రవేశాలకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం డైరెక్టర్ డా.యన్.విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. ఈ ప్రవేశ పరీక్ష ఓ ఎం ఆర్ షీట్స్ విధానంలో నిర్వహించబడుతుంది. 6వ తరగతి ప్రవేశానికి 01.04.2014 నుండి 31.03.2016 మధ్య జన్మించిన విద్యార్థులు, 9వ తరగతి ప్రవేశానికి 01-04-2011 నుండి 31-03-2013 మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులు. దరఖాస్తులను సమర్పించడానికి చివరి తేదీ 31 అక్టోబర్ 2025. ప్రవేశ పరీక్ష విధానం, నమూనా ప్రశ్నలు, మాక్ టెస్టులు, కోచింగ్ మరిన్ని వివరాలకు విశ్వం సైనిక్ నవోదయ పోటీ పరీక్షల కేంద్రం, వరదరాజనగర్, లేదా ఫోన్ 8688888802 / 9399976999 ను సంప్రదించవచ్చు. విద్యార్థులు ఈ ప్రతిష్టాత్మక అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఓ ఆర్ ఐని సందర్శించిన వి.సి



**తిరుపతి విద్య, అక్టోబర్ 11 ప్రభాతవార్త:** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతి ఆచార్య తాతా నరసింగరావు బాధ్యతలు చేపట్టిన వెంటనే సాయంత్రం విశ్వవిద్యాలయంలోని ప్రతిష్టాత్మకమైన ప్రాచీన తాళపత్ర గ్రంథాలయాన్ని ( ఓఆర్ ఐ) సందర్శించారు. తాను వెబ్సైటులో చూసిన తాళపత్ర గ్రంథాలను నేరుగా చూసి ఆశ్చర్యపోయారు. సంస్థ సంచాలకులు ఆచార్య పి సి వెంకటేశ్వర్లును అడిగి వివరాలు తెలుసుకున్నారు. పరిరక్షణకు తీసుకుంటున్న శాస్త్రీయ విధానాలను చూసి అభినందించారు. ఇంత పెద్ద స్థాయిలో ప్రాచీన సాహిత్యం భద్రంగా యస్వీయూ సంరక్షించడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమని పేర్కొన్నారు. డా రాజశేఖర్, చంద్రశేఖర్, డా వెంకటేష్, సిద్దయ్య, బాషా, నాగరాజు, శోభన్ బాబు, విశ్వనాథ్ రెడ్డి, పరిశోధకులు సంతోష్, సోమలింగడు, శోభన్లపాల్గొన్నారు.

## యస్వీయూలో పులి సంచారంపై అప్రమత్తం ఉండండి:వి.సి



**తిరుపతి విద్య, అక్టోబర్ 11 ప్రభాత వార్త:** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో స్టాఫ్ క్వార్టర్స్ సమీపంలో పులి సంచారంపై ఉపకులపతి ఆచార్య నర్సింగరావు విశ్వవిద్యాలయ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఆ పరిసరాల్లో వారు శనివారం కలియతిరిగారు. సెక్యూరిటీ సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. చిరుత సంచారంపై అటవీశాఖ అధికారులకు సమాచారం అందించే ఏర్పాట్లు చేశారు. ఆయా ప్రాంతాల్లో నివసించే కుటుంబాలు, ఆ ప్రాంతంలో తిరిగే వారికి తెలిసేలా బారికేడ్లను, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

## రైలు ఢీకొని వృద్ధుడు మృతి

**పుత్తూరు రూరల్, అక్టోబరు 11 ప్రభాతవార్త:** రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన పుత్తూరు పట్టణంలో శనివారం జరిగింది. రేణిగుంట రైల్వే కానిస్టేబుల్ శివ కథనం మేరకు... పుత్తూరు మండలం ఎగువ తిరుమలకుప్పం గ్రామానికి చెందిన వెంకటేశ్వరు(77) తిరుపతిలోని రాయల్‌నగర్ సంతలో జీవాలు కొనుగోలు చేసేందుకు పుత్తూరు రైల్వేస్టేషన్‌కు వచ్చే క్రమంలో 1వ నంబరు ప్లాట్‌ఫాంపై నడిచి వస్తుండగా కన్యాకుమారి నుంచి ఖిపుర్‌గంజ్‌కు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు వేగానికి ఆయన రైలు కింద పడి మృతి చెందాడు. స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఆయన వద్ద లభించిన ఆధారాలతో కుటుంబ సభ్యులకు సమాచారం తెలియజేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు.

## టపాసుల గోదాములను తనిఖీ చేసిన సిఐ



**తొట్టంబేడు, అక్టోబర్ 11 ప్రభాతవార్త** దీపావళి వస్తుంది. టపాసుల చిట పటలు. పిల్లల సందడి. అయితే బాణ సంచాతో ప్రాణాలకు ముప్పు. దీపావళికి ముందే రాష్ట్రంతో పాటు తమిళనాడులో గోదాములు ఉత్పత్తి సంస్థల్లో పేలుళ్ళు సంభవిస్తున్నాయి. ఈ నేపధ్యంలో తొట్టంబేడు మండలంలోని పలు టపాసుల గోదాములను టూటౌన్ సిఐ నాగార్జున్‌రెడ్డి వారి సిబ్బందితో కలసి ఆకస్మికంగా తనిఖీ చేసారు. అక్రమంగా నిల్వలు కల్గి ఉన్నా రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఆయన గోదాము వ్యాపారులను హెచ్చరించారు. గతంలో టపాసుల దుకాణాలు దీపావళికి ముందు వెలిసేవి. కానీ నేడు కొందరు దీనిని వ్యాపారంగా నిర్వహిస్తున్నారు. అంతేకాక శ్రీకాళహస్తికి సమీపంలోని చెన్నై-నాయుడుపేట బైపాస్‌రోడ్డులో గోదాములు వెలసి ఉన్నాయి. దాంతో ముందుజాగ్రత్త చర్యగా ఆయన తన సిబ్బందితో కలసి తనిఖీలు నిర్వహించారు. లెసెన్సు ల్లేకుండా వ్యాపారం చేసిన స్టాకు నిల్వ చేసినా, రవాణా చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

## యువత కలసికట్టుగా పనిచేయాలి



**శ్రీకాళహస్తి, అక్టోబర్ 11 ప్రభాతవార్త** రాబోవు రోజుల్లో రాజకీయాల్లో యువత కీలకం కావాలని శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు ప్రకాశం పంతులు అన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం వైకాపా యువజన అధ్యక్షులుగా ఎంపికైన మునికృష్ణారెడ్డిని శనివారం ఆయన సత్కరించారు. ఈసందర్భంగా మునికృష్ణారెడ్డి మాట్లా డుతూ తానొక్కడు యువజన అధ్యక్షుడు అయినంత మాత్రాన సరిపోదని రాబోవు రోజుల్లో యువత యాక్టివ్ కావాలని పార్టీని అధికారంలోకి తీసుకురా వటానికి పనని చేయాలని యువత కలసి కట్టుగా పని చేస్తే వైకాపాకు అధికారం తథ్యమన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి, శ్రీకాళహస్తి నియోజకవర్గంలో బియ్యపు మధుసూధనరెడ్డిల గెలుపు తథ్యమన్నారు.

## గంగ కాల్వపై విద్యుత్ మోటార్లు చోరీ

**సత్యవేడు, అక్టోబరు 11 ప్రభాతవార్త:**

సత్యవేడు మండలం మదనంబేడు గ్రామంలో శుక్రవారం రాత్రి మూడు విద్యుత్ మోటార్లు చోరీకి గురయ్యాయి. తెలుగు గంగ కాల్వకు పక్కనే పంట పొలాలకు బిగించిన విద్యుత్ మోటార్లను గుర్తు తెలియని దుండగులు కొందరు తొలగించి ఎత్తుకెళ్లినట్టు స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో రాజేంద్ర, సోమయ్య, మురగయ్య రైతులకు సంబంధించిన విద్యుత్ మోటార్లు చోరీకి గురయ్యాయి. గతంలో కూడా ఈ ప్రాంతంలో 6,7 విద్యుత్‌మోటార్లు రైతులు సంబంధించినవి చోరీ అయినట్టు స్థానికులు చెబుతున్నారు. తరచూ విద్యుత్ మోటార్లు చోరీకి గురి కావడం పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. పైగా పక్కనే ఉన్న సిరుణంబుదూరులో ఉన్న కొందరు పనేనంటూ బాధితులు ఆరోపిస్తున్నారు. దీనిపై పోలీసు అధికారులు స్పందించి విచారించాలని కోరుతున్నారు.

## స్విమ్స్ ఆప్తమాలజీ విభాగం ఆధ్వర్యంలో అతిథి ఉపన్యాసం

తిరుపతి హెల్త్, శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆప్తమాలజీ (కంటి) విభాగం ఆధ్వర్యంలో శ్రీ పద్మావతి ఆడిటోరియం నందు అతిథి ఉపన్యాసం నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలియజేశారు. స్విమ్స్ డీన్ డా. అలోక్ సచన్, రిజస్ట్రార్ డా. అపర్ణ ఆర్ బిట్లా, ఆప్తమాలజీ విభాగాధిపతి డా. ప్రభంజన్ కుమార్, అతిథి డా. వెంకటాచలం గార్లు జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆప్తమాలజీ విభాగాధిపతి డా. ప్రభంజన్ కుమార్ మాట్లాడుతూ హైదరాబాదుకు చెందిన ప్రముఖ కంటి వైద్య నిపుణులు డా. ఎ. వెంకటాచలం స్విమ్స్‌కు వచ్చి శ్రీవారి వైద్యసేవ పథకంలో భాగంగా పేషంట్లను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా క్యాటరాక్ట్ (శుక్లాలు), గ్లకోమా ఆపరేషన్లు నిర్వహిస్తున్నారని తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్, ఆప్తాల్మిక్ సర్జన్, హైదరాబాద్ డా. ఎ.వెంకటాచలం మాట్లాడుతూ డ్రై ఐ కంప్యూటర్ విజన్ సిండ్రోమ్ డిజిటల్ పరికరాల వాడకం వల్ల కంటి సమస్యలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆప్తమాలజీ విభాగపు వైద్యులు, డిప్యూటీ రిజిస్ట్రార్ డా.ఎర్రంరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## అగ్నిమాపక నిబంధనలు మేరకే టపాకాయలు దుకాణాలు ఏర్పాటు

-టపాకాయల దుకాణాల స్థల పరిశీలనలో అధికారులు



**తిరుపతిరూరల్, అక్టోబర్11 ప్రభాతవార్త:** తిరుపతిలో టపాకాయల దుకాణాలను ఫైర్ సెఫ్టీ నిబంధనల మేరకే ఏర్పాటు చేయాలని అధికారులు టపాకాయాల దుకాణాదారులకు సూచించారు. శనివారం తిరుపతిలో టపాకాయలు ఏర్పాటు చేసే ప్రదేశాలను సంబంధిత శాఖలు పోలీసు, రెవెన్యూ, ఫైర్ అధికారులు పరిశీలించారు. దీపావళిని పండగను పురస్కరించుకుని తిరుపతి నగరములో 3 ప్రాంతాల్లో ఎస్వీ జెఎన్ఎం గ్రౌండ్-22 దుకాణాలు, హథీరాంజీ మఠం గ్రౌండ్-16 దుకాణాలు, డిబిఆర్ హస్పిటల్ రోడ్డులోని ఏడిఆర్ గ్రౌండ్‌లో-18 దుకాణాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అగ్నిమాపకశాఖ, పోలీసు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా పరిశీలన చేసారు. లైసెన్స్‌దారులకు నిబంధనల మేరకు లాటరీ పద్ధతిన లేక అందరి అంగీకారంతో అనుమతులు జారీ చేస్తామని తెలిపారు. జీఎస్టీ రిటర్న్, ఎలక్ట్రిసిటీ సర్టిఫికేట్, ఫైర్ సెఫ్టీ ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. దుకాణాల మధ్య దూరం 3మీటర్లు ఉండాలని, ఫైర్ సెఫ్టీ ప్రధానమని, చినపొరబాటు కూడా జరగరాదన్నారు. ఇసుక, నీటిడ్రమ్స్ ప్రతి దుకాణం వద్ద అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈస్థల పరిశీలన కార్యక్రమంలో తిరుపతిఅర్బన్ తహశీల్ధార్ సురేష్‌బాబు, యూనివర్సిటీ, వెస్ట్, ఈస్ట్ సి.ఐ.లు, మునిసిఫల్ ఫైర్ ఆఫీసర్, డిప్యూటీ తహశీల్ధార్ రామచంద్ర, సర్వేయర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుచ్చి వాహనంపై “రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు”



**చంద్రగిరి, అక్టోబర్ 11 ప్రభాతవార్త:** శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం రోహిణీ నక్షత్రాన్ని పురస్కరించుకుని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు బంగారు తిరుచ్చిపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు సాయంత్రం రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ వల్లంశెట్టి రమేష్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ఆనుంబట్టు ధనశేఖర్, అర్చకులు నారాయణాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బాలికలే దేశ భవిష్యత్తుకు పునాధులు



**రామచంద్రాపుర ం, అక్టోబర్ 11 ప్రభాతవార్త:** బాలికలే దేశ భవిష్యత్తుకు పునాధులని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రేవతి అన్నారు. కుప్పంబాదూరు బిసి బాలికల సంక్షేమ వసతి గృహంలో శనివారం ప్రపంచ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాదూరు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలను ఆస్తిగా భావించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఆడపిల్లలను బాగా చదివించి ఉన్నత స్థాయిలో ఉంచాలని ఆకాంక్షించారు. మహిళలను గౌరవించే కుటుంబం ఆర్థికంగా, అన్నివిధాల అభివృద్ధివైపు నడుస్తుందన్నారు. బాలికల వ్యక్తిగత శుభ్రత, బాల్యవివాహాల వలన కలిగే అనర్థాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

**రేణిగుంట అక్టోబర్ 11 ప్రభాతవార్త** రేణిగుంట మండలం ఆంజనేయ పురం చెక్‌పోస్ట్ వద్ద రోడ్డు పక్కన పొదల్లో సుమారు 50 నుండి55 సంవత్సరాల వృద్ధుడు మృతి చెంది ఉండడాన్ని శనివారం స్థానికులు గుర్తించారు. అర్బన్ సీఐ జయచంద్ర ఆదేశాల మేరకు అర్బన్ పోలీసులు సంఘటనా స్థలం చేరుకొని మృతి చెందిన విధానాన్ని పరిశీలించాడు. మృతుడు అనారోగ్య కారణంగా మృతి చెంది ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. చనిపోయిన వ్యక్తి 5 అడుగుల 6 అంగుళాల ఎత్తు, నలుపు రంగు ఫాంటు ధరించి ఉన్నాడు. మృతుని ఆచూకీ తెలిసినవారు రేణిగుంట సర్కిల్ ఇన్స్పెక్టర్ మొబైల్ నెంబర్ 9491074540, అర్బన్ ఎస్సై మొబైల్ నెంబర్ 9440796765, లేదా పోలీస్ స్టేషన్ ల్యాండ్ లైన్ నెంబర్ 08772289023 లకు తెలియజేయాలని పోలీసులు తెలిపారు.

## ధన ధాన్య యోజన ప్రారంభ కార్యక్రమం



**రేణిగుంట అక్టోబర్ 11 ప్రభాతవార్త** ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం న్యూఢిల్లీ పుసా జాతీయ వ్యవసాయ విజ్ఞాన పరిషత్ వేదికగా ప్రారంభించిన పీఎం ధన ధాన్య యోజన ప్రత్యక్ష ప్రసారాన్ని రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ చైతన్యపురం రాస్ కృషి విజ్ఞాన కేంద్రం నందు రైతులు వీక్షించడానికి డిజిటల్ టీవీల ప్రత్యక్ష ద్వారా ప్రసారం చేశారు. ప్రసార వీక్షణం రాస్ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త హెడ్ డాక్టర్ శ్రీనివాసులు పర్యవేక్షణలో జరిగింది. తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహసంచాలకులు డాక్టర్ సుమతి, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ రిజిస్ట్రార్ డాక్టర్ గిరిధర కృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన అనుబంధ సంస్థల వ్యవసాయ అధికారులు, దాదాపు 400 మంది రైతులు ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. ప్రసారం అనంతరం రైతులకు వివిధ పంటలకు సంబంధించి అనేక అంశాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహసంచాలకులు సౌభాగ్య లక్ష్మి, సహ వ్యవసాయ సంచాలకులు మనోహర్, రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సుధాకర్, దివ్య, రామ్ కుమార్, అనూష, దివ్య సుధ తదితరులు పాల్గొన్నారు..

## దేశ భవిష్యత్తు బాలికలదే : రమేష్ రెడ్డి

**రేణిగుంట అక్టోబర్ 11 ప్రభాతవార్త** భారతదేశ భవిష్యత్తు బాలికలపై ఆధారపడి ఉందని రాస్ చైల్డ్ ఫండ్ ఇండియా ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్ రెడ్డి అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి ఇందిరా నగర్ రాస్ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తు బాలికలపై ఆధారపడి ఉందన్నారు. బాలికలను బాగా చదివించి సమాజానికి ఉపయోగపడే మహిళలుగా తీర్చిదిద్దాల్సిన ఆవశ్యకత గురువులు, తల్లిదండ్రులపై ఉందన్నారు. బాలికలను సరస్వతి పుత్రికలుగా భావించాలన్నారు. బాలికలకు మంచి పౌష్టికాహారం పెట్టి ఆరోగ్యవంతంగా పెంచాలన్నారు. కార్యక్రమంలో రేణిగుంట ప్రాథమిక వైద్యారోగ్య కేంద్ర హెల్త్ సూపర్వైజర్ కామరాజు, జిల్లా హెల్త్ డెమో కిరణ్ కుమార్ పాల్గొన్నారు...

## సత్యవేడు సమగ్ర అభివృద్దే లక్ష్యం

**సత్యవేడు, అక్టోబరు 11 ప్రభాతవార్త:** సత్యవేడు మండలంలో అన్ని పనులు సమగ్ర అభివృద్ధి లక్ష్యం గా పని చేస్తానని ఎమ్మెల్యే ఆదిమూలం స్పష్టం చేశారు. శనివారం మధ్యాహ్నం సత్యవేడులో నిర్మా ణంలో ఉన్న అన్న క్యాంటీన్ టీటీడీ కల్యాణ మం డపం పనులను ఎమ్మెల్యే ఆదిమూలం పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని దాసుకుప్పం బైపాస్ రోడ్డు, టీపీ కోట రోడ్డుతో పాటు పెండింగ్‌లో ఉన్న పలు వంతెనలు, అరణియార్, కాలంగి ప్రాజెక్టుల ఆధునికీకరణ, కైలాసనాథ కోన పర్యాటక అభివృద్ధి, పోలీసు ఔట్‌పోస్టు ఏర్పాటు వంటి పనులు చేపట్టడానికి సాయశక్తుల కృషి చేస్తానన్నారు. అలాగే నిర్మాణంలో ఉన్న అరణియార్ పర్యాటక అభివృద్ధి, టీటీడీ కల్యాణ మండపం, అన్న క్యాంటీన్, ద్వారకానగర్ వంతెన నిర్మాణం పనులు వేగవంతంచేసేందుకు కృషి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఏఎంసీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, ఆయకట్టు సంఘం చైర్మన్ పద్దు రాజు, అధికారులు, కూటమి పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



**తొట్టంబేడు, అక్టోబర్ 11 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకర్గంలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన నిరుపేదలను ఆదుకొనుటకు సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందని బొజ్జలబృందమ్మ అన్నారు. శనివారం తొట్టంబేడు మండలంలోని సాంబయ్యపాళెంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చిన చెక్కును ఆమె అందించారు. శనివారం సాంబయ్యపాళెంకు చెందిన ఆదిలక్ష్మీ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆమెకు మంజూరు అయిన రూ.2,03,653లు చెక్కును అందించారు. ఈ కార్యక్రమాల్లో బృందమ్మతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు, జయచంద్రానాయుడు, సుధాకర్‌యాదవ్ కమల్ కుమార్, మల్లీశ్వరి, వెంకటరెడ్డి, మునిచంద్ర, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిలో క్రియాస్ కిచెన్ ఘనంగా ప్రారంభం



**తిరుపతి విద్య అక్టోబర్ 11 ప్రభాత వార్త:** తిరుపతి స్విమ్స్ కూడలి వద్ద క్రియాస్ కిచెన్ రెస్టారెంట్ శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆరణి మదన్ విచ్చేసి రెస్టారెంట్‌ను ప్రారంభించి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మదన్ మాట్లాడుతూ క్రియాస్ కిచెన్ వంటి ఆధునిక సదుపాయాలతో, పరిశుభ్రమైన వాతావరణంలో రుచికరమైన ఆహారం అందించే రెస్టారెంట్‌లు తిరుపతిలో పెరగాలని నాణ్యత, రుచి, వినియోగదారుల సంతృప్తి పట్ల చూపుతున్న కట్టుబాటు అభినందనీయం అని పేర్కొన్నారు. రెస్టారెంట్ యాజమాన్యం మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఇంటివంట రుచిని గుర్తు చేసేలా, కుటుంబసభ్యులు సంతోషంగా భోజనం చేసే వాతావరణాన్ని అందించడమే క్రియాస్ కిచెన్ లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టిడిపి నాయకులు జెబీ శ్రీనివాసులు, మహేష్ యాదవ్, ఆర్ సి ముని కృష్ణ, సోమల సురేష్, బోత్ హరి ప్రసాద్, నరసింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ప్రభుత్వాస్పత్రిలో గైనకాలజిస్ట్ నియామకం



**పుత్తూరు, అక్టోబరు 11 ప్రభాతవార్త :** పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో మూడు నెలలుగా గైనకాలజిస్ట్ లేకపోవడం వల్ల మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్‌కు తెలిపారు. దీనిపై వెంటనే స్పందించిన ఆయన నగరి ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ యు.హెచ్.జరీనాను డిప్యూటేషన్‌పై పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో నియమించేలా చర్యలు తీసుకున్నారు. దాంతో శనివారం నుంచి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో గైనకాలజీ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

## గ్రామీణ ప్రాంతాల్లో నీటి నాణ్యత పరీక్షలు

**కేవీబీ పురం, అక్టోబరు 11 ప్రభాతవార్త**

గ్రామీణ ప్రజలకు అందించే తాగునీటి నాణ్యతను నిర్ధారించేందుకు నీటి పారుదలశాఖ అనుబంధంగాపని చేస్తున్న గ్రామీణ నీటి సరఫరా శాఖ విస్తృతంగా నీటి నమూనాల పరీక్షలను కేవీబీ పురం మండలంలోని బైరాజుల కండ్రిగ(రామకృష్ణాపురం)లో నాణ్యత పరీక్షలు నిర్వహించారు. ప్రతి గ్రామంలోని బోర్లు, ఓపెన్ వెల్స్, ట్యాంకులు, మిషన్ వాటర్ సప్లయ్ పాయింట్ల నుంచి నీటి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆరోగ్యానికి హాని కలిగించే ఫ్లోరైడ్, నైట్రేట్, ఇనుము, బ్యాక్టీరియా వంటి హానికార పదార్థాల ఉనికిని అంచనా వేయనున్నట్లు అధికారులు తెలిపారు. పరీక్షల ఫలితాల ఆధారంగా సంబంధిత గ్రామ పంచాయతీలకు నివేదికలు అందజేసి తక్షణ చర్యలు తీసుకునే విధంగా ప్రణాళికలు తయారు చేయనున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు తెలిపారు.

## సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్లను నియమించాలి

**కేవీబీ పురం, అక్టోబరు 11 ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన కేబీబీ పురం సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్లను నియమించాలని పలువురు మండల కేంద్ర ప్రజలు వాపోతున్నారు. డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకునేందుకు లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మండల జనరల్ బాడీ సమావేశంలో కూడా సచివాలయంలో ఒకటి, రెండు చోట్ల తప్ప అన్ని సచివాలయాల్లో కూడా డిజిటల్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న పొంతాల్లో రేషన్ కార్డులు, పెన్షన్లు, ప్రతి ఒక్కరు ఆధార్‌కార్డు మార్పుల కొరకు తదితర సౌకర్యాలకు అభ్యర్థించడానికి లిస్టు లేకపోవడంతో కొన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. దీనిపై జనరల్ బాడీ తీర్మానంలో ఎమ్మెల్యే ఆదిమూలం కూడా జాయింట్ కలెక్టర్‌కు సమాచారం అందించినా ఇంత వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వాపోతున్నారు.

## బాలికగా నాతోనే మార్పు - రండి ముందుకు

**పుత్తూరు రూరల్, అక్టోబరు 11 ప్రభాతవార్త:**



అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా పుత్తూరు సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బాలికల హక్కులు, చదువుకోవాల్సిన ఆవశ్యకత, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడం, సమాజంలో ఉండవలసిన తీరు, బాల్య వివాహాలు చేసుకోకుండా వారి భవిష్యత్ బంగారు బాట కావడానికి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సీడీపీవో సంధ్య వివరించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి వారి భావాలు వ్యక్తీకరించిన వారికి బహుమతులు అందజేశారు. బాల్య వివాహాలు చేసుకోకుండా, చదువు డిగ్రీ వరకు కొనసాగిస్తామని పిల్లలందరూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పిల్లలు పాటలు, నృత్యాలతో ఉత్సాహంగా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ సుబ్బరత్న, పుత్తూరు ప్రాజెక్టు సూపర్‌వైజర్ గీతాంజలి, డి.శ్రీదేవి, ఎం.అనిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సూపర్ జీఎస్టీ, సేవింగ్స్ ప్రచార కార్యక్రమం

**పుత్తూరు రూరల్, అక్టోబరు 11 ప్రభాతవార్త:** పుత్తూరు రూరల్ గోపాలకృష్ణాపురం పంచాయతీలో సూపర్ జీఎస్టీ-సూపర్ సక్సెస్ డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమం నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజిమాధవయ్య సూచనల మేరకు నిర్వహించారు. ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తూ వస్తువులపైన తగ్గిన పన్ను భారం గురించి, ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పుత్తూరు రూరల్ పార్టీ అధ్యక్షుడు బాలాజీ, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎం.జి.కుమార్, బూత్ కమిటీ అధ్యక్షుడు హరి గోపాల్, రూరల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగయ్య, ఎస్.భారతి, జనసేన సభ్యులు ఎస్.శిరీష, మాజీ సర్పంచ్ కె.కన్నయ్య, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

## 13,14న పుత్తూరులో సీఐటీయూ జిల్లా మహాసభలు



**పుత్తూరు రూరల్, అక్టోబరు 11 ప్రభాతవార్త:** సీఐటీయూ తిరుపతి జిల్లా మహాసభలు అక్టోబరు 13,14 తేదీల్లో పుత్తూరులో బీఎస్ఎన్ కల్యాణ మండపంలో రెండు రోజుల పాటు జరగనున్నాయని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కంధారపు మురళి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు తారా స్థాయికి చేరుకుంటున్నాయని ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 13 గంటల పని విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించటాన్ని ఆయన తీవ్రంగా తప్పు పట్టారు. గత 13 ఏళ్లుగా కార్మికులకు కనీస వేతనాలు నిర్ణయించడంలో తీవ్రమైన జాప్యం జరిగిందన్నారు. డిసెంబరు 31 నుంచి విశాఖలో అఖిల భారత మహాసభలు, డిసెంబరు 31 నుంచి ఐదు రోజుల పాటు సీఐటీయూ అఖిల భారత సభలు విశాఖపట్నంలో జరగనున్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.జనార్ధన్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, మునిరాజ, ఆర్.వెంకటేష్, భాస్కర్, విజయ్, అంగన్‌వాడీ నాయకులు, మునికుమారి, విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



**బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబరు 11 ప్రభాతవార్త:** ఆరోగ్యమే మహాభాగ్యం ప్రతి ఒక్కరూ తమ పరిసర ప్రాంతాలలో వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తే ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర, ఆరోగ్య అధికారి డి.ఎన్.వెంకటేశ్వరులు తెలిపారు. పరిశుభ్రతతోనే ఆరోగ్యం కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని బీసీ బాలుర వసతి గృహం, ఎస్సీ బాలుర వసతి గృహాల వంట శాల, మల విసర్జనశాల, మూత్రశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం నిల్వ ఉన్న నీటిని పూర్తిగా ఖాళీ చేసి మరల పట్టుకుని ఫ్రైడే డ్రైడే పాటించాలని, తాగునీటిని వేడి చేసి చల్లార్చి పిల్లలకు అందించాలన్నారు. పిల్లలకు శారీరక పరిశుభ్రత, ఆడపిల్లలకు రుతు స్రావ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి తెలియ జేశారు. కార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## కబడ్డి జిల్లా స్థాయి జట్టు ఎంపిక

**తొట్టంబేడు, అక్టోబర్ 11 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శనివారం డివిజన్ స్థాయి కబడ్డి పోటీలను ఎంపిక చేసారు. బాలికల కబడ్డి జిల్లా స్థాయి ఎంపిక పోటీలకు 14,17 సంవత్సరాల లోపు జట్టులను ఎంపిక చేసారు. ఈ జట్టుల ఎంపికను స్కూల్ గేమ్స్ కార్యదర్శి పి.కిషోర్ కుమార్ సారధ్యంలో ఎంపిక చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమాలకు స్థానిక శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్‌కుమార్, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్‌లు ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. ఇక్కడ డివిజన్ స్థాయి కబడ్డి క్రీడాకారులను ఎంపిక చేసారు. వారు జిల్లా స్థాయిలో పోటీల్లో పాల్గొంటారు.


IN THE COURT OF THE HON'BLE III ADDL DISTRICT AND SESSIONS JUDGE-CUM-PRINCIPAL FAMILY COURT MEDCHAL-MALKAJGIRI DIST., AT: KUKATPALLY

E.P. No. 304 OF 2022 IN O.S.No. 35 OF 2007

Between:
**M/s. RAINBOW COLOUR LAB**
A Division of M/s. Ushakiron Movies Limited ...Plaintiff

AND

**M/s. Sivabhaktendra Movies,**
Rep. by its Proprietor/Producer,
Yaratha Ram Prasad Reddy ...Defendant

To,
**4. Yaratha Ram Prasad Reddy,** S/o Yaratha Nagaraja Reddy, C/o Rathnavel Kalyanasundaram Roja Selvamani, W/o R K Selvamani, D No 10-15-241/5, Near Mandapam, Nagari Mandalam, Nagari, Chittoor District, Andhra Pradesh - 517 590.

Whereas the Decree Holder/Plaintiff filed the above EP against you for recovery of a sum of **Rs.1,74,11,754/-**. The above EP is posted to **22-10-2025** for your appearance. You are hereby summoned to appear either in person or through your pleader with your defense if any At 10-30 A.M. on the above said date before the Hon'ble Court, failing which the EP will be heard And determined exparte and orders pass accordingly.

**(BY ORDER OF THE HON'BLE COURT)**
**K. YADAGIRI RAO,** Advocate,
# 207 & 208, Aditya Towers,
Vinayak Nagar, Neredmet,
Secunderabad – 500 056

# గూడూరు డివిజన్

## శ్రామిక్ నగర్ సమస్యలను పరిష్కరిస్తా
### - గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్



గూడూరు, అక్టోబర్ 11 ప్రభాతవార్త : రెండో పట్టణ పరిధిలోని అండర్ బ్రిడ్జి ప్రాంతంలో ఉన్న శ్రామిక్ నగర్‌లో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పర్యటించారు. ఇటీవల అక్కడి ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరడంతో ఆయన ప్రజలను కలిశారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలువలు, రోడ్లు వంటివి లేవని వారు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రామిక్ నగర్ వివాదంలో ఉందని, ముందు అధికారులు స్థలాలు ఎవరివో సర్వే చేసి తేల్చాలన్నారు. ఇళ్ళ మధ్య ఉన్న ట్రాన్స్ ఫార్మర్ వద్ద కంచె ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. డ్రైనేజీ కాలువలు, రోడ్లు వంటివి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమ ంలో పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసిల్దార్ ప్రసాద్, డిస్కం ఈఈ నరేంద్రరెడ్డి, నాయకులు పులిమి శ్రీనివాసులు, రహీం, ఇజ్రాయేల్, సీపీఎం నాయకులు జోగి శివకుమార్, అడపాల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టపడి చదవాలి : ఎస్ఐ



కోట, అక్టోబర్ 11 ప్రభాతవార్త: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోట ఎస్ఐ పవన్‌కుమార్ అన్నారు. శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కోటలోని బాలసదన్‌లో 30 మంది విద్యార్థులకు ఎస్ఐ పవన్‌కుమార్ చేతులు మీదుగా విద్యాసామగ్రి పంపిణీ చేశారు. చంబడిపాలెం గ్రామానికి చెందిన సూళ్లూరు చిరంజీవి 3వ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం పురిణి నాగభూషణం, శ్రీనివాసులు దాతృత్వంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులకు బ్యాగులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాలసదనం సిబ్బంది అనూరాధ, శ్రీలక్ష్మి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## పప్పు ధాన్యాల ఉత్పత్తులపై దృష్టి సారించాలి



వెంకటగిరి, అక్టోబర్ 11 ప్రభాతవార్త: పప్పు ధాన్యాల ఉత్పత్తులపై రైతులు దృష్టి సారించాలని కె అధిపతి డాక్టర్ శ్రీధర్ తెలిపారు. ప్రధాన మంత్రి ధన ధాన్య కృషి యోజన పథకం ప్రత్యక్ష ప్రసారం చేయడం జరిగింది. ప్రధాన మంత్రి ధన ధాన్య కృషి యోజనలో భాగంగ పప్పు ధాన్యల ఉత్పతి పెంచడంలో భాగంగా కొత్త రకాలు, విత్తన శుద్ధి, సమగ్ర యాజమాన్య పద్దతులు మీద అవగాహన కల్పించడం జరిగింది. ఎడిఎ అనసూయ ప్రకృతి వ్యవసాయ సాగులో పాటించాలిసిన యాజమాన్య పద్ధతుల గురుంచి వివరించడం జరిగింది. రబి పంట సాగులో పాటించాలిసిన మెలకువలు గురుంచి తెలియ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు విజయశ్రీ, తిరుపాల్, నాగార్జునరెడ్డి, రాజీవన, వ్యవసాయశాఖ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు, రైతులు మహిళలు పాల్గొన్నారు.

## విదేశీ పక్షుల కేంద్రాన్ని సందర్శించిన జర్మన్ దేశస్తులు



దొరవారి సత్రం, అక్టోబర్ 11, ప్రభాతవార్త: నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాన్ని శనివారం తడ ప్రాంతంలోన శ్రీసిట నుంచి జర్మని దేశంకి చెందిన విదేశీయులు యాసుకోచి ఎసి, మసాటోనిషి యార సందర్శించారు. స్థానిక చెరువుల్లో ఆశించిన స్థాయిలో వలస పక్షులు లేకపోడంతో నిరుత్సా హంగా వెనుతిరగక తప్పలేదు. అక్కడే ఉన్న ఫారెస్ట్ రేజంర్ ఆఫీసర్ విదేశీయులు ఇద్దరిన పలకరించి జామ మొక్కలను బహుమతిగా అందజేసి ప్రకృతి కాపాడాలన ఆమె వారిని కోరింది.

## తూపిలి కాలువ పూడికతీ



వాకాడు, అక్టోబర్ 11 ప్రభాతవార్త : వాకాడు స్వర్ణముఖి బ్యారేజీ నుండి తూపిలి చెరువుకు నీరు సరఫరా అయ్యే కుడి కాలువ పూడికతీత పనులు జరుగుతున్నాయి. మండలంలోని స్వర్ణముఖి బ్యారేజ్‌కి సంబంధించిన తూపిలి చెరువు సాగునీటి సంగం అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి పనులను చేపడు తున్నాడు. వర్ణముఖి బ్యారేజికి సంబంధించిన చెరువులుకు సాగునీరు అందించడమే తమ లక్ష్యమని శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ముఖ్యంగా స్వర్ణముఖి బ్యారేజ్ నుండి ప్రధాన చేరువైన తూపిలి చెరువు లింకు నుండి అన్ని చెరువులకు సాగునీరు అందుతుందని తెలిపారు. దీంతో సాగునీరుతో పాటు తాగునీరు కూడా సౌలభ్యం ఉందన్నారు. ఏఈ కృష్ణయ్య మాట్లాడుతూ తూపిలి కాలవ పూడిక పనులకు 4.9 లక్షలు రూపాయలుతో పనులు జరుగుతుందని తెలిపారు.

## నాదెండ్లని కలిసిన జనసేన నాయకులు



గూడూరు, అక్టోబర్ 11 ప్రభాతవార్త: జనసేన పార్టీ పిఏసి ఛైర్మెన్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ని తెనాలి పట్టణం లోని జనసేన పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా జనసేన నాయకులు కలిసారు. ఆయనను కలిసిన వారిలో ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన పార్టీ నెల్లూరు నగర అధ్యక్షు లు దుగ్గిశెట్టి సుజయ్ బాబు, జిల్లా ఉపాధ్య క్షులు తీగల చంద్రశేఖర్‌రావ్, కృష్ణ పెన్నా రీజినల్ కో ఆర్డినేటర్స్ కోలా విజయలక్ష్మి, గుండ్లూరు నాగరత్నం ఉమ్మడి నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గం ఇంచార్జ్ నలిశెట్టి శ్రీధర్, సూళ్లూరుపేట నియోజకవర్గం ఇంచార్జ్ ఉయ్యాల ప్రవీణ్, కావలి నియోజకవర్గం ఇంచార్జ్ అలహరి సుధాకర్, సర్వేపల్లి నియోజకవర్గానికి ఇంచార్జ్ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు, కోవూరు నియోజకవర్గం సమన్వయకర్త చప్పిడి శ్రీనివాసులురెడ్డి, నెల్లూరు జిల్లా కార్యదర్శి షేక్ అలియా, నెల్లూరు నగర ప్రధాన కార్యదర్శి శనివారపు అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

### ఆధ్యాత్మికనగరంలో ...
## భక్తిభావం పంచుతున్న నగర సంకీర్తన



తిరుపతి, అక్టోబర్ 11ప్రభాతవార్త: ఆధ్యాత్మికనగరం తిరుపతిలో అడుగడుగునా భక్తిభావం పెంపొందించే దిశగా రాయల సీమ రంగస్థలిచేపట్టిన నగరసంకీర్తన విజయవంతంగా సాగుతోంది. శనివారం వేకువజామున వందమందికిపైగా భజన మండలి కళాకారులు, రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ మాఢవీధుల్లో నగరసంకీర్తనలో గోవిందనామ స్మరణలు, భజనలతో మారుమోగింది. నగరసంకీర్తనలతో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతోంది. భజన, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పలువురు కళాకారులు కెఎన్ రాజా, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, నాగేశ్వరరెడ్డి, కల్ప, బాబు, యశస్విని, కల్యాణి, పార్వతి, మునికృష్ణారెడ్డి, మణికంఠ, వాసు, మేకల గంగయ్య, కోండే చెంగారెడ్డి తదితరులు నుదుటిన నామం ధరించి భక్తితో చేపట్టారు.

## మంత్రిని అనితను సన్మానించిన విజయ్‌బాబు



పుత్తూరు, అక్టోబరు 11 ప్రభాతవార్త : చిత్తూరు జిల్లాలోని గంగాధరనెల్లూరు నియోజకవర్గం పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనితకు రేణిగుంట విమానాశ్రయంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు ఘన స్వాగతం పలికారు. పూలదండలు, దుశ్శాలువాతో ఆమెను ఘనంగా సత్కరించారు.

## తిరుపతి వాసికి బంగారు నంది అవార్డు




తిరుపతి హెల్త్, అక్టోబర్ 11 ప్రభాతవార్త: హైదరాబాదులో మ్యాక్స్ గ్లోబల్ ఫౌండేషన్ అధినేత చైర్మన్ దినేష్ వారి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ నందు డాక్టర్ నందమూరి తారక రామారావు కళా మందిరములో సౌత్ ఇండియా బంగారు నంది అవార్డును తిరుపతి వాసి ఆర్టీసీ ఉద్యోగి గుండ్లూరు సుబ్రమణ్యం అందుకున్నారు. సమాజం పై జానపద కవితలు పలు రచనలు చేసిన అతని ప్రతిభను గుర్తించి ఉత్తమ రచయితగా దుశ్యాలవతో సత్కరించి దక్షిణ భారతదేశ బంగారు నంది అవార్డు ప్రధానము చేసిన ఈ కార్యక్రమానికి విశిష్టతగా విచ్చేసిన తెలంగాణ ప్రభుత్వం ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, వెన్నెలా గద్దర్, తెలంగాణ ఉద్యమ వీరులచే మ్యాక్స్ గ్లోబల్ ఫౌండేషన్ టీం సన్మానించారు.

## ప్రేమిస్తున్న సినిమాను ఆదరించండి



తిరుపతి హెల్త్, అక్టోబర్ 11 ప్రభాతవార్త: బాల నటుడుగా కేడి, రేసుగుర్రం, బాహుబలి, తదితర చిత్రాల్లో నటించిన సాత్విక్ వర్మ హీరోగా పరిచ యం చేస్తూ ప్రేమిస్తున్న సినిమా పూర్తయిందని ఆ సినిమాను నవంబర్ 7వ తారీఖున ప్రేక్షకుల ముందుకు వస్తుందని ప్రేమిస్తున్న సినిమాని ఆదరించాలని డైరెక్టర్ భాను తెలిపారు. ఈ సందర్భంగా శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ప్రేమిస్తున్న టీం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లవ్ ఎంటర్టైన్మెంట్, అలాగే మదర్ సెంటిమెంట్‌తో రూపొందించిన చిత్రం ప్రేమిస్తున్న చిత్రాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించాలని హీరో కోరుకున్నారు. ఈ సమావేశంలో ప్రేమిస్తున్న టీం పాల్గొన్నారు.

## పోలీసులా మజాకా.... ఒకరోజులో నిందితుని అరెస్టు

రేణిగుంట అక్టోబర్ 11 ప్రభాతవార్త : రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ గువ్వల కాలనీలో శుక్రవారం జరిగిన హత్య కేసులో నిందితుడు శ్రీహరిని గాజులమండ్యం (రేణిగుంట రూరల్) పోలీసులు ఒక్కరోజులోపే శనివారం అదుపులోకి తీసుకొని రిమాండ్కు తరలించారు. శ్రీహరి శుక్రవారం గువ్వల కాలనీకి చెందిన మేస్త్రి ద్వారా హత్యకు గురయ్యాడు. అప్పటినుండి తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు సూచనలతో రూరల్ సిఐ మంజునాథ్ రెడ్డి పర్యవేక్షణలో గాజులమండ్యం సుధాకర్, ట్రైన్ ఎస్సై ప్రవల్లిక, హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం, కానిస్టేబుళ్లు మణి, గోపి, వాసు, శివ నిందితుడి గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుని రేణిగుంట ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద అదుపులో తీసుకొని రిమాండ్ కు తరలించారు. ఒకరోజులో నిందితుని అదుపులోకి తీసుకున్న పోలీసులను జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

## సూళ్లూరుపేటలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం



సూళ్లూరుపేట, అక్టోబర్ 11 ప్రభాతవార్త : పట్టణం లోని ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శనివారం కోళ్లమిట్ట, ఎర్రబాలెం అంగన్‌వాడీ సెంటర్లలో అంతర్జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. 11 నుంచి 18లోపు వయస్సు గల బాలికలు నలుగురిలో ఎలా మెలగాలి, చదువుకు నేటప్పుడు ఎవరితో ఎలా ప్రవర్తించాలనే అంశాలపై వివరించారు. అనంతరం వీరికి బాలికా దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణమ్మ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సురేఖ, సిహెచ్ సౌజన్యలు పాల్గొన్నారు.

## జగన్ ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరు : పాదర్తి



కోట, అక్టోబర్ 11 ప్రభాతవార్త: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని చూసేందుకు ప్రజలు వేలాదిగా తరలివస్తున్నారని, దీన్ని చూసి కూటమి ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు విధించినా ప్రజల నుంచి దూరం చేయలేరని రాష్ట్ర వైసీపీ పంచాయతీరాజ్‌శాఖ కార్యదర్శి పాదర్తి రాధాకృష్ణా రెడ్డి అన్నారు. ఆయన శనివారం కోటలో విలేఖరులతో మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి పర్యటనకు అశేష జనవాహిని తరలివచ్చి అచంచలమైన అభిమానాన్ని చాటారని చెప్పారు. విశాఖ నుంచి నర్సీపట్నం మెడికల్ కాలేజి వరకు 63 కిలోమీటర్ల మేరకు ప్రయాణానికి 6 గంటల సమయం పట్టిందంటే ఏ స్థాయిలో ప్రజలు వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి సంఘీభావం తెలిపారో అర్థమవుతుందన్నారు. ఇది కూటమి ప్రభుత్వంపై ఉన్న ప్రజాగ్రహానికి నిదర్శనమని పేర్కొన్నారు.

## బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి



కోట, అక్టోబర్ 11 ప్రభాతవార్త : ఆడబిడ్డ పుడితే అరిష్టం అనే వారు, ఇంటికి భారం అనుకునే వారు, కొందరు కడుపులోనే చిదిమేసే వారు. అయితే ప్రస్తుతం కాలం మారిందని, ఆలోచన విధానంలో మార్పు వచ్చిం దని కోట ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ కవిత అన్నారు. శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కోట మండలం చిట్టేడు లోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పాపాయి జన్మిస్తే మహాలక్ష్మి పుట్టిందని మురిసి పోతున్నారని చెప్పారు. ప్రభుత్వం బాలికలకు అనేక పథకాలను ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ వేంకటేశ్వరునికి లక్ష్మీ నరసింహావతారం



సూళ్లూరుపేట, అక్టోబర్ 11 ప్రభాతవార్త: పట్టణంలోని శ్రీమద్వేంకట రామమూర్తి దేవస్థానంలో పెరటాశి నెల చివరి శనివారాన్ని పురస్కరించుకుని శ్రీ వేంకటేశ్వర స్వామివారికి శ్రీ లక్ష్మీ నరసింహావతారాన్ని చేశారు. దేవస్థానం ప్రధాన అర్చకులు అనంతకుమార్ దీక్షితులు ఆధ్వర్యంలో ఈ అలంకరణ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## కన్నులపండువగా శ్రీ శ్రీనివాస కల్యాణం



సూళ్లూరుపేట, అక్టోబర్ 11 ప్రభాతవార్త : పట్టణం లోని శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీనివాస కల్యాణాన్ని శనివారం కన్నులపండువగా నిర్వహించారు. దేవస్థానం అర్చకులు కార్తికేయ స్వామి ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం జరిగింది. ఉదయం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రారంభమైన కల్యాణం మధ్యాహ్నం వరకు కొనసాగింది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## అంబేడ్కర్‌ను కించపరిచిన వారిని శిక్షించాలి : ఎమ్మెల్యే నెలవల



సూళ్లూరుపేట, అక్టోబర్ 11 ప్రభాతవార్త: గంగాధరనెల్లూరు దేవలంపేట గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పుపెట్టి అనుచితంగా ప్రవర్తించిన వైసీపీ సర్పంచ్, వారి అనుచరులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కోరారు. శనివారం ఆమె రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితతో కలిసి దేవలంపేట గ్రామంలో సంఘటన జరిగిన ప్రాంతానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె అంబేద్కర్ విగ్రహానికి హోంమంత్రి అనిత, ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, ఎంపీ వెంకటేశ్వరరావుతో కలిసి పాలాభిషేకం చేసి శుద్ధి చేశారు. అంబేద్కర్ విగ్రహంపై దుశ్చర్యకు పాల్పడిన వారిపై చర్యలతో పాటు రాష్ట్రంలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ విజ్ఞప్తి చేశారు.

## శివాలయానికి లక్ష రూపాయలు విరాళం



సూళ్లూరుపేట, అక్టోబర్ 11 ప్రభాతవార్త: పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో నూతనంగా నిర్మించతలపెట్టిన శివాలయం నిర్మాణానికి కారంచేటి సుమతి, మల్లికార్జునరావు దంపతులు లక్ష రూపాయలు విరాళాన్ని శనివారం నిర్మాణ నిర్వాహకులకు అందజేశారు. గతంలో వీరు రామాలయ నిర్మాణానికి లక్ష రూపాయలు విరాళం అందజేసి ఉన్నారు. ప్రస్తుతం బ్రాహ్మణవీధిలో నిర్మించతలపెట్టిన శివాలయానికి భక్తులు విరివిగా విరాళాలు అందజేయాలని నిర్మాణ కమిటీ వారు కోరారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం : ఎమ్మెల్యే



గూడూరు, అక్టోబర్ 11 ప్రభాతవార్త :గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే సునీల్ కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 19 లక్షల46 వేల 845 రూపాయలను చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నీళ్ళు లేక మూత పడుతున్న మరుగుదొడ్లు
### -జవాబుదారి తనం లేని దేవస్థానం అధికారులు




శ్రీకాళహస్తి, అక్టోబర్ 11 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారుల తీరు కేవలం రాహుకేతుదోష నివారణ పూజల పర్యవేక్షణ, అక్కడ ఆదాయాలపై అధికారుల దృష్టి భక్తులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారంపై చూపటం లేదు. శని, ఆదివారాల్లో ఆలయానికి సామాన్య భక్తులు వేలాది మంది వస్తుంటారు. వారికి సంబంధించి సన్నిధివీధిలో మరుగుదొడ్లకు నీటి సరఫరా లేకుండా మూత పడుతుంటే అధికారులు ఎందుకు స్పందించరు? భక్తుల పట్ల జవాబుదారి తనంతో వ్యవహరించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటం వారి విధుల పట్ల వారికున్న నిబద్ధతను తెలియజేస్తుంది. శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తుల మరుగుదొడ్ల సమస్యలు వర్ణనాతీతంగా ఉంది. గత పాలకులు భక్తుల సౌకర్యార్థం సన్నిధివీధిలో రూ.40లక్షలు వెచ్చించి మరుగుదొడ్లను నిర్మించారు. వారు అధికారంలో ఉన్నంత కాలం వాటిని ప్రారంభించుకోలేక పోయారు. కూటమి వచ్చిన తరువాత శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి పరిశీలించి అధికారుల మీద వత్తిడి తెచ్చి ప్రారంభోత్సవం చేయించి భక్తుల మన్ననలను పొందారు. అయితే గత కొన్ని నెలలగా రెండవ శనివారం విద్యుత్తు అంతరాయం ఏర్పడుతున్నది. మరుగుదొడ్ల వద్ద విద్యుత్తు కనెక్షన్‌ను ఆలయ జనరేటర్‌కు అనుసందానం చేయకపోవడంతో ఈ సమస్య ఏర్పడుతున్నది. మరుగుదొడ్లు నిర్మించినపుడు అక్కడ ఎంత నీళ్ళు వాటకం జరుగుతుందనే అంశాన్ని ఎందుకు పరిగణలోకి తీసుకొని నీటి ఏర్పాటు చేయలేదన్నది చర్చనీయాంశంగా మారింది. మరుగుదొడ్లకు నీటి సరఫరా చేసేందుకు విద్యుత్‌శాఖ కనెక్షన్లతో నడుస్తుంది. విద్యుత్‌శాఖకు అంతరాయం కల్గినపుడు నీటి సమస్య చోటు చేసుకుంటుంది. ఈ నేపథ్యంలో శనివారం రెండవ శనివారం ఉదయం 9గంటల నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయ కల్గింది. దాంతో నీటి సరఫరా లేకుండా మరుగుదొడ్లు మూత పడ్డాయి. స్నానఘట్టాల వద్ద నీటి సరఫరా లేక భక్తులు తిప్పలు పడ్డారు.

**ఇఇ వివరణ:**
శ్రీకాళహస్తీశ్వరాలయ పర్యవేక్షణలో నిర్వహించబడుతున్న మరుగుదొడ్లు, మూతపడ టానికి సంబంధించి ప్రభాతవార్త ఇఇ మురళీధర్‌రెడ్డిని వివరణ కోరగా ఆయన ఇలా తెలిపారు. ఇక్కడ మరుగుదొడ్లకు సంబంధించి రెండు నీటి ట్యాంకులను ఏర్పాటు చేసామని అయితే శనివారాల్లో సమస్య ఏర్పడుతుందన్నారు. ఇక మీదట దేవస్థానం జనరేటర్ల నుంచి కనెక్షన్ ఇప్పిస్తున్నట్లు వివరించారు. ఇక మూతపడే అవకాశం ఉండదని మురళీధర్‌రెడ్డి వివరించారు.

## వానెల్లూరు భూ అక్రమాలపై కేసు నమోదు

సత్యవేడు, అక్టోబరు 11 ప్రభాతవార్త: సత్యవేడు మండలం వా నెల్లూరులో జరిగిన భూ అక్రమాలపై ఎట్టకేలకు అధికారులు స్పందించారు. ఏకంగా అక్కడ అటవీ భూములకు కొందరి పేర్లతో ఆన్‌లైన్‌లో హక్కు కల్పించిన నిందితులను గుర్తించి కేసు నమోదు చేసినట్లు సీఐ మురళీనాయుడు తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వివిధ పార్టీల నాయకులు ఎన్నికలపై దృష్టి పెట్టడం, ఇదే అదునుగా భావించి రెవెన్యూ సిబ్బంది అక్కడ అటవీ భూములను పట్టా భూములుగా ఆన్‌లైన్‌లో ఎక్కించి లక్షలాది రూపాయలు దండుకున్నారు. సర్వే నెం.197 ఉన్న సుమారు 287 ఎకరాల అటవీ భూములను స్థానికేతరులకు ధారా దత్తం చేయడానికి సిద్ధమయ్యారు. ఆన్‌లైన్‌లో పేర్లు కూడా ఎక్కించడం జరిగింది. అదే విధంగా మరి కొంత భూమిని వేరే వారి పేర్ల మీద నమోదు చేశారు. రెవెన్యూ సిబ్బంది తమ చేతివాటాన్ని ప్రదర్శించి అటవీ భూములకే పక్కాగా ప్రైవేటు వ్యక్తులకు హక్కు కల్పించారు. ఈ వ్యవహారంపై తరచూ అందిన ఫిర్యాదులపై జిల్లా కలెక్టర్ స్పందించడం, స్థానిక తహసీల్దార్ రాజశేఖర్ సత్యవేడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

**16 మంది నిందితులు:**
అటవీ భూములకు, లేని భూములను ఉన్నవిగా చూపించి పలువురికి ఆన్‌లైన్‌లో హక్కులు కల్పించిన 13 మంది నిందితులుగా ఈ కేసులో ఉన్నారని సీఐ మురళీ నాయుడు తెలిపారు. అప్పటి తహసీల్దార్ రామాంజులనాయుడు, సిబ్బంది పి.సురేష్, పి.రాఘవేంద్ర, వెంకటేష్, జగదీష్, శ్రీధరన్, అమృత వర్షని, నవీన్‌రాజ్ కన్నా, అనురాధ, లతా జయకుమార్, ఆశ సురేష్, పి.మల్లీశ్వరి, హెచ్.బత్తమ్మ, పి.భార్గవ్, పి.తేజస్విని, పి.పూర్ణచంద్ర నాయుడుల మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళీనాయుడు, ఎస్ఐ రామస్వామిలు వెల్లడించారు.

## కరి వరదరాజస్వామిని దర్శించుకున్న రోజా



పుత్తూరు(నగరి), అక్టోబరు 11 ప్రభాతవార్త : మునిసిపాలిటీ పరిధిలోని సత్రవాడ గ్రామంలో వెలసిన శ్రీ భూదేవి, శ్రీదేవి సమేత శ్రీ కరివరదరాజస్వామిని పర్యాటక శాఖ మాజీ మంత్రి ఆర్.కె.రోజా శనివారం దర్శించు కున్నారు. టిటిడి ఆధ్వర్యంలో శనివారం పౌర్ణమి నెల చివరి వారంలో నిర్వహించిన పుష్ప వాహన మహోత్సవంలో ఆమె పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అర్చనలు నిర్వహించి ఆమెకు తీర్థ,ప్రసాదాలు అందించారు. భక్తులు, స్థానిక వైకాపా నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు.

## హోం మంత్రి అనితకు స్వాగతం



రేణిగుంట, అక్టోబర్ 11 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితకు రేణిగుంట విమానాశ్రయంలో శనివారం ఘన స్వాగతం లభించింది. విజయవాడ నుండి రేణిగుంట చేరుకున్న ఆమెకు విమానాశ్రయంలో జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు, రూరల్ సిఐ మంజునాథరెడ్డి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, టిడిపి నాయకులు సి ఆర్ రాజన్, తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె రోడ్డు మార్గంలో తిరుపతి వైపు బయలుదేరి వెళ్లారు. రోడ్డు మార్గంలో జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అర్బన్ సీఐ జయచంద్ర కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టుబోర్డు...15న ప్రమాణ స్వీకారం?

శ్రీకాళహస్తి, అక్టోబర్ 11 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయ దేవస్థానం పాలకమండలిని పూర్తిస్థాయిలో దేవాదాయశాక ప్రకటించింది. శుక్రవారం రాత్రి బోర్డు సభ్యులకు సంబందించి జివో జారి చేసిన దేవాదాయశాఖ శనివారం మరో జిఓలో ప్రత్యేకాహ్వానితుల పేర్లను ప్రకటించారు. గతంలో బోర్డులో మిరాసిదారులు, ఆలయ అర్చకుల నుంచి ఒకరిని ఎక్స్ అఫిషియే సభ్యులుగా తీసుకున్నట్లు ప్రకటించారు. శనివారం జారి చేసిన ఉత్తర్వుల్లో ప్రత్యేకాహ్వానితులుగా చాగణం శైలజ, మొక్కపాటి వెంకటరమణా నాయుడులను నామినేట్ చేసారు. బోర్డులో 17 మందిని నామినేట్ చేసారు. వీరి వివరాలు ఇలా ఉన్నాయి. కోట్టె సాయి ప్రసాద్, బీల శ్రవంతి, చిన్నపోల లక్ష్మీనారాయణ డి.లక్ష్మమ్మ, జి.గోపినాథ్, కె.కుసుమ కుమారి కొమ్మన బోయిన రజని, నాగరాజు కొప్పెరాల, పెనగలూరు హేమావతి, కొమ్మరి విజయమ్మ, రుద్రాక్షల కౌసలమ్మ, దండి రాఘవయ్య, పగడాల మురళి, వి.గుర్రప్పశెట్టి, కోలా వైశాలి, ప్రకాష్‌రెడ్డి, కల్లె సావిత్రిలను నామినేట్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ బోర్డు ప్రమాణ స్వీకారం చేసిన తేదీ నుంచి రెండేళ్ళ పాటు అధికారంలో ఉంటుంది. ఈ నెల 15న ప్రమాణస్వీకార కార్యక్రమం వుంటుందని అంటున్నారు.

## రుయాలో పాలియేటివ్ కేర్ శిక్షణ ప్రారంభం



తిరుపతి హెల్త్, అక్టోబర్ 11 ప్రభాతవార్త: ఎస్వి వైద్య కళాశాల, రుయా ఆసుపత్రిలో పాలియేటివ్ కేర్, శిక్షణ కార్యాలయం ఎస్వి వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి రవి ప్రభు ప్రారంభంచారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవి ప్రభు మాట్లాడుతూ ఈ పాలెటివ్ కేర్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తూ, క్యాన్సర్ రోగులు యొక్క సహాయకులకు, ఇక్కడ స్పెషలిస్ట్ డాక్టర్ ద్వారా శిక్షణ ఇప్పించి క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు ఏ విధంగా సహాయ పడాలి, వారికి శిక్షణ, మరియు అవగాహన కల్పించి మారుమూల ప్రాంతాల్లో ఇంటివద్దె క్యాన్సర్ వ్యాధి గ్రస్తులకు చికిత్స అందించే విధానం గురించి పూర్తిగా వివరించబడునని తెలిపారు. ఇందులో ముఖ్యంగా కౌన్సిలింగ్ సైకాలజిస్టు, సోషియాలజిస్టు, ఫిజియోథెరపిస్టు, న్యూట్రిషనిస్ట్ క్యాన్సర్ రోగి సహాయకులకు శిక్షణ ఇవ్వడంలో అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తారని ఆయన తెలిపారు. ఈ యొక్క పెలెటివ్ కేర్ శిక్షణ కార్యాలయాన్ని మొట్టమొదటిసారిగా రుయా ఆసుపత్రి నందు 1976 వైద్య విద్యార్థుల ఓల్డ్ అల్యూమిని బ్యాచ్, తిరుపతి రోటరీ క్లబ్ సహాయంతో దీన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ దగ్గుబాటి శ్రీహరి రావు, తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, రుయా ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ జె. రాధ, ప్రసూతి వైద్యశాల సూపరిటెండేట్ డాక్టర్ ప్రమీలా, తిరుపతి జిల్లా వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్, తిరుపతి రోటరీ క్లబ్ సభ్యులు, బిఆర్ శ్రీధర్ డిస్టిక్ గవర్నర్ రోటరీ క్లబ్, ప్రెసిడెంట్ రాజేంద్ర శెట్టి, సెక్రటరీ శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి నాగేంద్ర కుమార్, ఎస్వి వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఏ చంద్రశేఖరన్, డాక్టర్ టి భారతి, రోటరీ క్లబ్ సభ్యులు, వైద్యులు, ఎస్వి వైద్య కళాశాల పిఆర్ఓ, వీర కిరణ్ తదుతరులు పాల్గొన్నారు.